ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 7 నవంబరు 2025 | 3








సీఎంతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా

సచివాలయం ఇక ..
'విజన్ యూనిట్'

- వీడియో కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా హాజరు

అమలాపురం,నవంబరు6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాన్ని 'విజన్‌యూనిట్'గా మార్చి పౌరులకు సుపరిపాలన సేవలను సమర్థవంతంగా అందించాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. అమరావతి నుంచి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్సులో సీఎం మాట్లాడుతూ డేటా ఆధారిత పాలనపై సదస్సు ద్వారా పలు పరిపాలనా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి వాటి ఉద్దేశాలను అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇందులో ప్రజాప్రతినిధులూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని వినియోగించుకోవాలని కోరారు. తుఫాన్‌ను టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామని, రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తంచేసి ప్రాణనష్టాన్ని నివారించుకోగలిగామని సీఎం పేర్కొన్నారు. డేటా ఆధారిత పాలన ప్రస్తుతం అత్యంత కీలకమైందిగా మారిందన్నారు. ప్రతీ నియోజకవర్గానికి ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటుచేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామని, ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఆయా శాఖలకు అప్పగించి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని సీఎం వీడియో కాన్ఫరెన్సులో వివరిస్తూ అధికారులకు సూచనలిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ నిషాంతి పాల్గొన్నారు.



తూర్పోదయం!

సరికొత్తగా తూర్పుగోదావరి..?

తూర్పుగోదావరి అతి పెద్ద జిల్లాగా ఆవిర్భవించనుంది.. జిల్లాకు కొత్త స్వరూపం రానుంది.. సరిహద్దులు మారనున్నాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే పశ్చిమలో ఉన్న మూడు నియోజక వర్గాలు విలీనం అయ్యాయి.మరో రెండు నియోజకవర్గాలు తూర్పున విలీనమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పున నియోజ కవర్గాల సంఖ్య 9కి చేరనుంది. మంత్రుల కమిటీ సూచనలు అమలైతే అతి పెద్ద జిల్లాగానూ ఆవిర్భవించనుంది.

- మారనున్న జిల్లా స్వరూపం
- మండపేట నియోజకవర్గం విలీనం
- రంపచోడవరం విలీనమా.. ప్రత్యేక అథార్టీనా
- ఆ రెండూ విలీనమైతేనే 9 నియోజకవర్గాలు
- 10న కేబినెట్‌లో నిర్ణయం
- డిసెంబర్ 31కి ముందే ప్రక్రియ పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం, ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం కలిసే అవకాశాలపై మంత్రుల కమిటీ చర్చించిన సంగతి తెలిసిందే. ఈనెల 10వ తేదీన అమరావతిలో జరిగే మంత్రివర్గ సమావేశంలో వీటిపై పూర్తి స్పష్టత రానుంది. మొత్తం ప్రక్రియ ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి కావాల్సి ఉంది. 2026 జనవరిలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ నేప థ్యంలో 10వ తేదీన కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్న తర్వాత జిల్లాల పునర్విభజన ప్రకటన వెలువడే అవకాశముంది. దాని తర్వాతే గెజిట్ జారీ చేస్తారు.

2022లో పునర్విభజన

2022లో జిల్లాల పునర్విభజన జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్ పరిధిని జిల్లాగా నిర్ణయిస్తూ జిల్లాల పునర్విభజన చేసేసింది. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను మూడు ముక్కలు చేసి తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ జిల్లాలుగా విభజించింది. కొత్త తూర్పుగోదావరి జిల్లాగా రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి ఏర్పాటు చేసింది. నాడు మండపేట నియోజకవర్గాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలపడాన్ని అక్కడ ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. ఎందుకంటే బొమ్మూరులో ఉన్న జిల్లా కలెక్టరేట్ కొద్ది దూరంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచించి మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపడానికి నిర్ణయించింది. దీంతో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు మూడు తూర్పుగోదావరి జిల్లాలో కలవనున్నాయి. మండపేట, రంపచోడవరం నియోజకవర్గాలు విలీనమైతే 9 నియోజకవర్గాలతో తూర్పుగోదావరి పెద్ద జిల్లా కానుంది. మండపేట నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం విషయంలో 10న క్లారిటీ రానుంది.

కోనసీమ వద్దు.. కాకినాడ ముద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రపురంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ డిమాండ్‌కు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం బంద్ పాటించారు. వర్తక వాణిజ్య, విద్యా సంస్థలు, బార్ అసోసియేషన్ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి జీవిత బీమా కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. కోనసీమ వద్దు, కాకినాడ ముద్దు అంటూ నినాదాలు చేశారు. 52 పంచాయతీలు, పురపాలక సంఘం రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని తీర్మానించాయని జేఏసీ నాయకులు అన్నారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్దు, చాంబర్ నాయకులు పసుపులేటి సత్తిబాబు, బార్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, గాదంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, కౌన్సిలరు అంకం శ్రీను, టీడీపీ నాయకులు నారపురెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఇలా చేయండి : రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలని ప్రదర్శన

రంపచోడవరం ఇలా...

ఏజెన్సీ పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోనే ఉండేది.2022లో జిల్లాల పునర్విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పడిన పాడేరు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపారు. 200 కిలోమీటర్ల దూరంలోని పాడేరు కలెక్టరేట్ పరిధిలోకి తేవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు పోలవరం ముంపు ప్రాంతాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కొందరు లేదా, తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కొందరు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రుల ఉప కమిటీ ఇక్కడి పరిస్థితులపై సమీక్షించింది. పోలవరం ముంపు మండలాలు, ఏజెన్సీని ప్రత్యేక అథార్టీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన చేశారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేసే అంశంపైనా చర్చించారు. ఏలూరు జిల్లాలో ఉన్న పోలవరం ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మండలాల మాటేమిటి..

2022లో జిల్లాల పునర్విభజన లోక్‌సభ స్థానం యూనిట్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా చాలాచోట్ల ఈ నిబంధన ఉల్లంఘించింది. దీంతో కొన్ని మండలాల పరిధిలో సమస్యలు నెలకొన్నాయి. గోపాలపురం నియోజకవర్గం పరిధిలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో.. చిన వెంకన్న ఆలయం ఉన్న ద్వారకా తిరుమల ఏలూరు జిల్లాలో కలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని గోకవరం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపారు. అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడిని కాకినాడ జిల్లాలో కలిపారు. ఆయా మండలాల ప్రజల సమస్యలు పెరిగాయి.. ఎమ్మెల్యేలు, ఎంపీ వంటి ప్రజాప్రతినిధులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు.. కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వేరే జిల్లాలకు చెందిన వారు. తూర్పు కలెక్టరేట్‌తో వీరి సం బంధాలు లేకుండాపోయాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

క్వాయిర్ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి : కలెక్టర్



అమలాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఆధారిత క్వాయిర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. క్వాయిర్ పరిశ్రమల ఏర్పాటు కోసం గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన ప్రాంతీయ సదస్సుకు కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరిసాగులో కోనసీమకు ప్రత్యేకత ఉందని, అయితే వీటి అనుబంధ పరిశ్రమల స్థాపనకు పెద్దగా ఎవరూ ముందుకు రాకపోవడంతో క్వాయిర్ పరిశ్రమలు అభివృద్ధి చెందడం లేదన్నారు. కొబ్బరి డొక్కల నుంచి వచ్చే ఫైబర్ పౌడర్‌ను ఉపయోగించి అనేక రకాల ఉత్పత్తులు తయారుచేసి జాతీయ సంపదగాను, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి దోహదపడుతుందన్నారు. క్వాయిర్ జియో టెక్స్‌టైల్స్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. అలాగే వీటిద్వారాఆ కాల్వగట్టు, రోడ్ల నిర్మాణంలో మన్నిక మూడు రెట్లు పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. దేశవ్యాప్తంగా అయిదు శాతం రోడ్ల నిర్మాణంలో ఇప్పుడు టెక్స్‌టైల్ మ్యాట్‌లు వినియోగిస్తున్నారన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల క్లస్టర్లలో ఈ పరిశ్రమలు, యూనిట్లు స్థాపించి ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వ శాఖలు సమన్వయం వహించాలని విజ్ఞప్తి చేశారు. బహుళ ప్రయోజనాలు కలిగిన ఉత్పత్తులు తయారుచేసేందుకు రైతులు సన్నద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ నెలాఖరులోగా కేరళ రాష్ట్రంలో కొబ్బరి బైప్రొడక్ట్ తయారీ పరిశ్రమల సందర్శన, ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించి అధ్యయనం చేయడం జరుగుతుందన్నారు. కొబ్బరి రైతులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిలో ప్రధానంగా విద్యుత్ రాయితీ ప్రకటించాలని కోరారు. ఈ సదస్సులో శాస్త్రవేత్తలు సురేష్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్ రాజా, ప్రాంతీయ సంచాలకుడు సుభాష్, పవన్‌కుమార్, విజయ్‌కుమార్, కృషీవల వ్యవస్థాపకుడు అడ్డాల గోపాలకృష్ణ, ఉద్యానశాఖాధికారి బీవీ రమణ పాల్గొన్నారు.


జానపద యువ కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

11న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువతలో దాగి ఉన్న విభిన్న కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు జిల్లా యువజన సంక్షేమశాఖ సెట్రాజ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 11న అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2025 పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన స్థానిక యువతీయువకులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సెప్టెంబరు 1 నాటికి 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు ఉన్న వారు పోటీల్లో పాల్గొనవచ్చు. వికసిత్ భారత్‌తోపాటు ఇతర విభాగాల్లోను ఈ పోటీలు జరుగుతాయి. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. పోటీలకు ఎంపికైన యువతకు ఉచిత ప్రయాణ భత్యం, భోజన సదుపాయాలను కల్పిస్తారు. గత మూడేళ్ల రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నవారు ఈ ఏడాది జరిగే పోటీలకు అనర్హులు. ఇక సాంస్కృతిక విభాగంతోపాటు జానపద అంశాలకు సంబంధించి ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఇన్నోవేషన్ విభాగంలో సైన్స్ మేళా ప్రదర్శన ఉంటుంది. సైన్స్ మేళా రాష్ట్రస్థాయి పోటీలతోనే ముగుస్తుంది. ఇక రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే పోటీలతోపాటు జిల్లాస్థాయిలో ప్రధానంగా యువతీ యువకులు పది మంది చొప్పున జానపద గేయాల రూపు, జానపద నృత్యం రూపుతోపాటు కథలు రాయడం, కవిత్వం రాయడం, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తారు. చదువుకున్న వారితోపాటు యువత కూడా పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కాకినాడలోని సెట్రాజ్ కార్యాలయం, సెల్ 9849913065, 8919135344ను సంప్రదించాలని సీఈవో కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

రేపు డీఆర్సీ సమావేశం

అమలాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఈనెల 8వ తేదీ శనివారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీక్షా కమిటీ సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు అధ్యక్షత వహిస్తారు. అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో సన్నద్ధమై రావాలని ఆదేశించారు. గత డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అడిగిన ప్రశ్నలకు తీసుకున్న చర్యల నివేదికలను సమావేశానికి తీసుకురావాలని సూచించారు.

ఎరువు.. దరువు

- కాంప్లెక్స్ ఎరువులపై రూ.50 వరకు పెంపు
- యూరియా, డీఏపీలకు మాత్రం మినహాయింపు


ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో దిగుమతి అవుతున్న ఎరువులు (ఫైల్‌ఫొటో)

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీసాగుకు వినియోగించే ఎరువులు ధరలు రైతులకు భారంగా మారనున్నాయి. తాజాగా కొన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తాకి రూ.50 వరకు పెంపు ఉండగా, మరిన్నింటిపై ధరల పెరుగుదల ఉంటుందని ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఎరువులు విక్రయించే డీలర్లకు సమాచారాన్ని అందజేశాయి. ఎరువుల తయారీకోసం వాడే ముడిసరుకు ధరల పెరుగుదలే ఎరువులు బస్తాల ధరల పెరుగుదలకు కారణమని కంపెనీలు చెబుతున్నాయి. పెరిగిన అదనపు భారం రైతుకు కొంత భారంగానే మారనుంది. ఒకపక్క ఖరీఫ్ పంట సాగు తుది దశకు చేరింది. అక్కడక్కడా కోతలు ప్రారంభమయ్యాయి. కోతలు పూర్తయిన వెంటనే రబీ సాగు పనులు రైతులు చేపట్టనున్నారు. ఈ ఏడాది సాగులో రైతులు అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. ఆదిలోనే ఎరువుల కోసం కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా యూరియా కోసం పాట్లు పడ్డారు. అయితే యూరియాను పెద్దస్థాయిలో దిగుమతి చేసుకోవడంతో ముప్పు తప్పింది. ఇటీవల అధిక వర్షాలు, మొంథా తుఫాన్ మరోసారి ఉక్కిరిబిక్కిరి గురిచేసింది. తాజాగా ఎరువుల ధరల పెరుగుదల అన్నదాతలను ఆవేదనకు గురిచేస్తోంది. యూరియా, డీఏపీలను మినహాయించినప్పటికీ కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచారు. జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. ఇందుకుగాను లక్ష మెట్రిక్ టన్నుల కుపైగా ఎరువులు పైబడి వినియోగం ఉంటుంది. వీటిలో యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వినియోగం ఎక్కువగా ఉంటుంది. తాజాగా వినియోగంలో ఎక్కువగా ఉండే కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెంచడంతో అన్నదాతలపై మరింత భారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

20-20-13 కాంప్లెక్స్ ఎరువుల ధర రూ.1350 నుంచి రూ.1400కి పెరిగింది. 14-35-14 ధర రూ.1850 నుంచి రూ.1900కి పెరిగింది. 10-26-26 రూ.1800 నుంచి రూ.1825కి పెరిగింది. 20-20-0-13 ధర రూ.1300 నుంచి రూ.1375 చేరగా, 24-24-0 ధర రూ.1800 నుంచి రూ.1900కి చేరింది. ఇలా పెరిగిన ధరలు రైతులపై ఆర్థికభారం మోపనున్నాయి.

ప్రభుత్వ డిజిటల్ సర్వీసు సేవలు ప్రతీ ఇంటికీ..

నేటి నుంచి 'మనమిత్ర' యాప్‌పై ప్రచారం

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలచేతిలో ప్రభుత్వం పేరుతో దేశంలోనే తొలిసారిగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించింది. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సర్వీసు సేవలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా ప్రజలకు ఎంతోమేలు చేకూరుతోంది. ఇంటి నుంచే ప్రతీ కుటుంబం ప్రభుత్వ సేవలను పొందే విధంగా రూపొందించిన 'మనమిత్ర' యాప్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించింది. దీనిలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సచివాలయ ఉద్యోగులు పల్లె, పట్టణమన్న భేదం లేకుండా ప్రతీ శుక్రవారం ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని జీఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. దీనిలో భాగంగా ప్రతీ శుక్రవారం జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతీ ఇంటికీ తిరిగి వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు ఏవిధంగా పొందవచ్చో ఆయా కుటుంబాల సభ్యులకు ప్రత్యక్షంగా తెలియజేయాలి. మనమిత్ర యాప్‌పై ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను ప్రతీ కుటుంబానికి అందజేయాలి. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా విజయవంతం చేసేందుకు అత్యవసర వైద్య అవసరాలు ఉన్న సిబ్బంది మినహా మిగిలిన వారంతా విధుల్లో పాల్గొనాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి వార్డు సచివాలయాల్లో అడ్మిన్ కార్యదర్శులు ప్రచార కార్యక్రమాన్ని అమలు చేయాలి. మనమిత్ర యాప్ ద్వారా తొలుత రాష్ట్ర ప్రభుత్వం 161 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అనంతరం 300కు పైగా వివిధ రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సంబంధిత సమాచారాన్ని క్షుణ్ణంగా తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 9552300009ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాస్థాయిలో జీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి పర్యవేక్షణలో డీఎల్డీవోలు సచివాలయ సిబ్బందిని పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.



ఐ లవ్ రావులపాలెం త్రీడీ, ఎల్‌ఈడీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

అభివృద్ధిలో కొత్త ఒరవడికి నాంది

త్రీడీ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కళావెంకట్రావు సెంటర్‌లో ఆధునాతన త్రీడీ లైటింగ్‌తో ఏర్పాటు చేసిన ఐ లవ్ రావులపాలెం సింబల్‌తో అభివృద్ధిలో కొత్త ఒరవడికి నాంది పలికిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద జాతీయ రహదారి చెంతనే నూతనంగా ఏర్పాటుచేసిన ఈ బోర్డును కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ త్రీడీ లైటింగ్ అదనపు ఆకర్షణగా నిలుస్తుందని, అదేవిధంగా కాటన్ విగ్రహంతో ఏర్పాటు చేసిన కోనసీమ ముఖద్వారం ఆధునికీకరణతో కొత్త రూపాన్ని సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలూవూరి సతీష్‌రాజు, గొలుగూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.





డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గీతాలాపన రిహార్సల్స్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వందేమాతరం సమర నినాదం





డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో వందేమాతరం, 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బెంగాలీ కవి బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతర గీతాన్ని సంస్కృతం, బెంగాలీ భాషల్లో 1875లో రచించారు. దీనిని తొలుత ఆయన 1882లో రచించిన నవల ఆనంద మఠంలో ప్రచురించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ పాటను రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి 1896లో కోల్‌కతాలో జరిగిన భారతీయ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. సుమారు మూడు నిమిషాలకు పైగా నిడివితో పూర్తిగా ఐదు పాదాలు ఉండే ఈ వందేమాతరం గీతంలో కేవలం రెండు చరణాలనే ఇప్పటి వరకు పాడుతున్నాం. మిగిలిన పాదాలు అంత ప్రాచుర్యంలో లేవు. అయితే ఆ మిగిలిన మూడు పాదాలను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నానికి భారతీయ జనతా పార్టీ శ్రీకారం చుట్టింది. అందరితోనూ వందేమాతరాన్ని పూర్తిగా పాడించేందుకు సిద్ధమైంది.

వందేమాతర గీతం శుక్రవారం నాటికి 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా "స్వరాజ్యం-స్వదేశీ-సమైక్యత" నినాదంతో బీజేపీ రాష్ట్ర శాఖ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తోంది. ఐదు చరణాలతో మూడు నిమిషాల నిడివి ఉన్న వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించేలా ఆ పార్టీ కాకినాడ జిల్లా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాకినాడ గాంధీనగర్ పార్కులో సుమారు పదివేల మంది విద్యార్థులతో గీతాన్ని పాడించేందుకు సన్నాహాలు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఏడు గంటల మధ్య ఈ కార్యక్రమం జరగనుంది.



వందేమాతరం గీతం అప్పట్లో రాజమహేంద్రవరం యువతను తొలిసారిగా ఉద్యమాలవైపు నడిపించిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. 1907 ఫిబ్రవరిలో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో ఓ బృందం ఉద్యమించింది. ఈ పరిణామాన్ని అప్పటి ప్రిన్సిపాల్ హంటర్ సహించలేక విద్యార్థులకు హెచ్చరికగా హరిసర్వోత్తమరావును కాలేజీ నుంచి బహిష్కరించాడని, అయినా సరే ఎవరూ బెదరకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.



ప్రస్తుతం వాడుకలో ఉన్న

వందేమాతరం

వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం
పుల్లకుసుమిత ద్రుమదుల శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

(వాస్తవానికి ఇక్కడ వరకే అందరూ వందే మాతర గేయాన్ని ఆలపిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లోనూ ఈ రెండు పాదాలతోనే సరిపెడుతున్నారు. మిగిలిన మూడు చరణాల ప్రస్తావన లేదు)

కోటి కోటి కంఠ కలకల నినాదకరాలే
కోటి కోటి భుజైర్ ధృత కర కరవాలే
అబలా కేయనో మా ఏతో బలే..
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదలవారిణీం మాతరామ్
వందేమాతరం... వందేమాతరం

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వం హి ప్రాణాః శరీరే
బాహుతే తుమి మా శక్తి హృదయే
తుమి మా భక్తి
తో మారయి ప్రతిమా గడి మందిరే మందిరే
వందేమాతరం... వందేమాతరం

త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ
నమామి త్వాం
నమామి కమలాం అమలాం అతులాం
సుజలాం సుఫలాం మాతరమ్
వందేమాతరం... వందేమాతరం

శ్యామలాం సరలాం సుస్మితాం భూషితాం
ధరణీం భరణీం మాతరం
వందేమాతరం...
వందేమాతరం...

కాకినాడలో నేడు సామూహిక గీతాలాపన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ జాతికి అందించి శుక్రవారానికి 150 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్ తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1923లో కాకినాడ గాంధీనగర్ పార్కులో కాంగ్రెస్ జాతీయ మహాసభలు జరిగాయని, వందేమాతరం ఆలపించమని విష్ణు దిగంబర్ పాలుస్కర్‌ను వేదికపైకి ఆహ్వానించారన్నారు. ఆయన గీతాలాపన చేస్తుండగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ ఆలీ ఈ గీతం తమ మతానికి వ్యతిరేకంగా ఉందని అడ్డగించారన్నారు. ఆనాటి అవమానకర సంఘటనకు, చారిత్రక తప్పిదానికి వేదికగా నిలిచిన గాంధీనగర్ పార్కులోనే సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ పార్కు వద్ద జరిగే సామూహిక వందేమాతర సామూహిక గీతాలాపన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ హాజరవుతారని తెలిపారు. దేశభక్తులు, నగరవాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, రమేష్, సురేష్, జ్యోతుల రాజేష్, యెనిమిరెడ్డి మాల కొండయ్య, గౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో తూర్పు నగరవనం



నగరవనం ఏర్పాటు కానున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

» 125 ఎకరాల భూమిలో ఏర్పాటు
» వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి
» తూర్పు అటవీ అధికారి ప్రభాకరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకుని దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో నగరవనం ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు తెలిపారు. ఈ నగరవనం ఏర్పాటు కానున్న దివాన్‌చెరువు నుంచి గైట్ కళాశాల మధ్య గల అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కిటెక్ట్ గౌరీశంకర్‌తో కలిసి డీఎఫ్‌వో ప్రభాకరరావు గురువారం క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో దాదాపు 125 ఎకరాల అటవీ భూమిలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నగరవనం మంజూరు అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం అటవీశాఖ ఆధ్వర్యంలో సందర్శకులకు ఆరోగ్యం, అహ్లాదం తోబాటు అవగాహనను పంచుతున్న లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కరవనం కంటే మరింత ఆకర్షణీయంగా ఈ నగరవనాన్ని తీర్చిదిద్దనున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దీనిని పూర్తిచేస్తామని అన్నారు. కాగా ప్రస్తుతం లాలాచెరువు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి మహాపుష్కరవనం దాదాపు పదేళ్ల క్రితం గోదావరి మహాపుష్కరాలు సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా 2015లో శంకుస్థాపన చేయగా 2016 నవంబరు 19న ప్రారంభించారని ఈ సందర్భంగా డీఎఫ్‌వో గుర్తుచేశారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందీశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచనల మేరకు అంతర్జాతీయ ప్రమాణాలున్న జూసఫారీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ ఓ.దావీదురాజు, డీఆర్వో పద్మావతి, బీట్ అధికారి గళ్లా రంగారావు పాల్గొన్నారు.

నేడు అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో చాంపియన్ షిప్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 69వ రాష్ట్ర అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో ఛాంపియన్ షిప్ అండర్ 17 బాల, బాలికలు పోటీలు గురువారం కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరగనున్నాయి. ఈ పోటీలు నవంబరు 7 నుంచి 9 వరకు జరుగుతాయని తెలిపారు. పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సగిలి షాన్ మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొనున్నారు. అండర్ 14, 17 నిర్వహణ కార్యదర్శి, పాఠశాల క్రీడా సమాఖ్య, కాకినాడ జిల్లా, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.సుధా రాణి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు క్రీడాలను పరిరక్షించునున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో హనీఫాకు గోల్డ్‌మెడల్

ఇతర విభాగాల్లో మరో నాలుగు పతకాలు



హనీఫాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని ఎండీ హనీఫా మెహ్నాజ్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఐదు పతకాలను కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన రోలర్ స్కేటింగ్ మీట్‌లో 1000 మీటర్ల రేసులో స్వర్ణ పతకం, రోడ్ ల్యాప్, మిక్స్‌డ్ రిలే, 500 మీటర్ల రేసుల్లో వెండి పతకాలు, 500 +డి రేసులో కాంస్య పతకం సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయాలతో హనీఫా డిసెంబరులో జరుగబోయే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీలు వై.సుధారాణి, ఎ.నాగులు అభినందించారు.

జేఎన్టీయూకే-స్కిల్ డిజైర్ అవగాహన ఒప్పందం



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్, స్కిల్ డిజైర్ ప్రతినిధులు

జేఎన్టీయూకే, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, హైదరాబాద్‌లోని స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. వీసీ సమావేశ హాలులో జరిగిన ఈ ఒప్పందం ద్వారా జేఎన్టీయూకే విద్యార్థులకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, స్కిల్ డిజైర్ ద్వారా కంప్యూటర్, ఐటీ స్కిల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామన్నారు. వీసీ సమక్షంలో సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, స్కిల్ డిజైర్ సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ మార్చుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

షిప్ బిల్డింగ్ యార్డును సందర్శించిన బాషా



షిప్ బిల్డింగ్ యార్డును సందర్శిస్తున్న ఫెడరేషన్ చైర్మన్ బాషా

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఖలీఫతుల్లా బాషా(సెంట్రల్ గవర్నమెంట్ నామినేటెడ్) కాకినాడ పర్యటనలో భాగంగా గురువారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిశారు. పోర్టు సమస్యలపై కలిసి పనిచేసే విషయమై చర్చించారు.అనంతరం శాన్ మెరైన్ షిప్పింగ్ సంస్థ అధినేత అహ్మద్ ఆలీషాతో కలిసి షిప్ బిల్డింగ్‌యార్డ్‌ను సందర్శించారు. బాషా మాట్లాడుతూ ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి కృషి చేసిన ఆలీషాను అభినందించారు. పోర్టులో పనిచేస్తున్న వర్కర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పోర్టుకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాషా వెంట ఏపీ ఆర్‌టీఐ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పప్పు దుర్గారమేష్, పలు సంస్థల ప్రతినిధులు ఎస్‌కే రఫీ, ఎస్‌కే ఇమామ్, హసన్ షరీఫ్, హబీబ్ బాషా ఉన్నారు.

10న అప్రెంటిస్, జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలలో వివిధ కంపనీలలో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వం ఐటీఐలో ఈనెల 10న ఉదయం 9గంటలకు ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల వర్మ తెలిపారు. జిల్లాలో గల ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావలసిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్, జెరాక్స్ కాపీలత పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న జేఎన్టీయూలో నిర్వహిస్తున్న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాకినాడ-సామర్లకోట ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లింపు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి సామర్లకోట మధ్య రోడ్డు నిర్మాణ పనులు కారణంగా ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లించినట్టు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంకాలం 5గంటల వరకు సామర్లకోట ముత్యాలమ్మ తల్లి గుడి నుంచి కాకినాడ వరకు రోడ్డు మూసివేయడంతో ఆర్ అండ్ బీ అధికారులు, పోలీస్ డిపార్మెంట్ సూచనల మేరకు ఆ రూట్‌లో వెళ్లే బస్సులన్నీ కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి ఏపీఎస్పీ, సర్పవరం జంక్షన్, ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట వెళతాయని డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు.

ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాధికారి(ఇన్‌చార్జి) వీడీజీ మురళి పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లమోలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. గరిష్ఠంగా 30 సంవత్సరాల వయస్సు, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి రెండు సంవత్సరాల ఒప్పందం మేరకు నెలకి 2,600 నుంచి 2700 యూరోలు(రూ.2.60 నుంచి రూ.2.70 లక్షలు) వేతనం లభిస్తుందని తెలిపారు. వసతి, అరైవల్ సహాయం వంటి సౌకర్యాలు అందిస్తారని తెలిపారు. అభ్యర్థులకు జర్మన్ భాషలో 12, 14 వారాల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. శిక్షణ ఫీజు 1.15 లక్షలు మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నవంబరు 15 లోగా సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99888 53335, 871265 5686, 87901 18349, నెంబర్లను సంప్రదించాలని మురళి తెలిపారు.

వెంకన్న ఆలయ వంట నౌకరి భూముల స్వాధీనం



వంట నౌకరి భూముల స్వాధీన బోర్డు పెడుతున్న అధికారులు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన వంట నౌకరి భూములను జిల్లా అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 27/2 సర్వే నెంబరులో 2.60 ఎకరాలు, 48/4ఏ సర్వే నెంబరులో 4.60 ఎకరాల భూమిని మార్గపురి జగన్నాథ వాసుదేవస్వామి, శేషప్రకాశ్, నరసింహకుమార్‌లకు వంట నౌకరీ భూములుగా గతంలో అందించారు. అయితే సంబంధిత వ్యక్తులు వంట నౌకరీ సరిగ్గా చేయకపోవడంతో సీసీఎల్‌సీ ఉత్తర్వులు మేరకు కోట్లాది రూపాయలు విలువైన భూములను దేవస్థానం స్వాధీనం చేసుకుంది. హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు మేరకు దేవదాయ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో వెళ్లి ఆ భూములను స్వాధీనం చేసుకున్నట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ భూములలోకి ప్రవేశించి ఎర్రజెండాలు పాతి స్వామివారికి చెందిన భూములుగా బోర్డులు పెట్టి స్వాధీన ప్రక్రియను పూర్తిచేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, రెవెన్యూ, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎన్‌సీసీ అధికారి

పెద్దాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను గురువారం నిర్వహించారు. 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అసిఫ్ మహమ్మద్ ఆదేశాల మేరకు 2025-26 శిక్షణా సంవత్సరానికి విద్యార్థులను ఎన్‌సీసీ సెలక్షన్ అధికారులు ఎంఎస్ రావు, శక్తివేల్, రానా, దిలీప్, మనీష్ ఎంపిక చేశారు. 11వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్‌లో పరుగు పోటీ, శరీర ధారుఢ్య పోటీ, మెడికల్ టెస్టులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసంత జగన్‌మోహన్, జూనియర్ డివిజన్ అసోసియేషన్ ఆఫీసర్ జాగ్రఫీ పీజీటీ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మురమళ్లలో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న యువకులు

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిపో నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును మురమళ్ల మాణిక్యాంబ గుడి వద్ద బుధవారం రాత్రి కొందరు యువకులు అడ్డుకున్నారు. మురమళ్ల వెళ్లేందుకు ఒక మహిళ అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద బస్సు ఎక్కింది. ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం ఆ మహిళ ఆధార్ కార్డు చూపించే ప్రయత్నం చేస్తుండగా అనాతవరం వద్ద నిర్మానుష్య ప్రదేశంలో కండక్టర్ ఆమెను దింపివేశారు. దీంతో ఆ మహిళ తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమందించింది. దీనితో కొందరు

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

యువకులు మురమళ్ల మాణిక్యాంబ ఆలయం వద్ద బస్సును అడ్డుకున్నారు. దీనితో యువకులకు, ఆర్టీసీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. గందరగోళం నెలకొంది. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలను వారించారు. తప్పు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి గాని బస్సును అడ్డుకోవడం సరికాదని సూచించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును అక్కడి నుంచి పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

పిఠాపురంలో కల్తీ నెయ్యి కలకలం

పిఠాపురంలో మరోసారి కల్తీ నెయ్యి కలకలం రేగింది. పశువుల కొవ్వు ఉపయోగించి నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపిస్తూ విశ్వహైందవ పరిషత్ ఆందోళనకు దిగడంతో అధికారులు స్పందించారు. 21డబ్బాల్లో ఉన్న పశువుల కొవ్వును సీజ్ చేశారు. గతంలో ఒకసారి ఇదే ప్రాంతాల్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో అధికారులు కేసు నమోదుచేసి సరుకును స్వాధీనం చేసుకున్నారు.

- 21 డబ్బాల్లో కొవ్వు, కల్తీ నెయ్యి స్వాధీనం
- పశువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపణ


పిఠాపురంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి, పశువుల కొవ్వు ఉన్న డబ్బాలు, విచారణ చేస్తున్న అధికారులు

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాధవనగర్‌లోని ఒక ఇంటిలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే సమాచారంతో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువుల కొవ్వు వినియోగించి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారని, దీనినే పవిత్రమైన ఆవు నెయ్యిగా విక్రయాలు జరుపుతూ భక్తులను మోసగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలోనే ఇదే రీతిలో కల్తీ నెయ్యి తయారు చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు చేరుకుని ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, ఆర్ఐ వెంకటేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర అప్పారావు అక్కడకు చేరుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న 21 డబ్బాల్లోని జంతువుల కొవ్వుతోపాటు అక్కడ ఉన్న కల్తీ నెయ్యిను స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్స్ సేకరించి ఫుడ్ కంట్రోల్ అధికారులకు పంపారు. శాంపిల్స్ సేకరించిన తర్వాత మిగిలిన జంతువుల కొవ్వును పూడ్చివేస్తామని అధికారులు తెలిపారు. తరచూ కల్తీ నెయ్యి తయారీ ఆరోపణలు వస్తున్నా నియంత్రణ గురించి అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తాను పలుమార్లు ఫిర్యాదు చేస్తేనేకానీ అధికారులు స్పందించలేదని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుంతలలో అదుపుతప్పి పడిపోవడంతో

లారీ ఢీకొని కూరగాయల వ్యాపారి మృతి


మృతిచెందిన గొల్లబ్బాయి

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-శాకినాడ ప్రధాన రోడ్డులో పెద్దపెద్ద గుంతలు కారణంగా గురువారం గోవిందరాజు పాలెంనకు చెందిన కూరగాయల వ్యాపారి తన టీవీఎస్ మోపెడ్ నుంచి రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ చక్రాల కిందపడి ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం వెంకటకృష్ణరాయపురం మాధవపట్నం మధ్య చోటుచేసుకుంది. సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు సిబ్బందితో ప్రమాదానికి గురైన వాహనాలను, మృతదేహాలను రోడ్డు పక్కకు తప్పించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతుడు పిఠాపురం నియోజకవర్గం గోవిం దరాజుపాలెంనకు చెందిన సిరికిపల్లి గొల్లబ్బాయిగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతి పేదరికంతో రోజూ కాకినాడ వెళ్లి కూరగాయలు ఇంటింటా అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తాడని బంధువులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.గన్నవరం అక్విడెక్టుకు

రూ.49.30 లక్షలతో మరమ్మతు

- 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాలి
- ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు


పాత అక్విడెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు

పి.గన్నవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం కొత్తఅక్విడెక్టుపై జాయింట్ల మరమ్మతుల నిమిత్తం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ.49.30లక్షలు మంజూరయ్యాయని పి.గన్నవరం సబ్ డివిజన్ డీఈ రవిప్రసాద్ రాజు తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే పనులు మొదలుపెడతామని ఆయన తెలిపారు. స్థానిక నీటిసంఘ అధ్యక్షులతో కలిసి గురువారం ఆయన పాత అక్విడెక్టును పరిశీలించి అనంతరం మాట్లాడారు. అక్విడెక్టుపై జాయింట్‌లు పూర్తిస్థాయిలో పాడయ్యాయని వాటి మధ్య ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. 33చోట్ల ఏడున్నర మీటర్లు వెడల్పుతో కూడిన ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లు అవసరమైనచోట ఇయరింగ్ కోట్లు ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే ఫుట్‌పాత్‌కు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. అక్విడెక్టుపై పనిచేసే సమయంలో సుమారుగా 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా పాత అక్విడెక్టుపై నుంచి వాహనాలను మళ్లించే విధంగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పాత అక్విడెక్టు కెపాసిటీని సంబంధిత ఇంజనీర్లతో చర్చించి సామర్థ్యం మేరకు వాహనాల రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భారీ వాహనాలను బొడసకుర్రువైపు మళ్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డైలీ బజారును, పాత అక్విడెక్టుపైన, ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి వాహనాల దారి మళ్లిస్తామని చెప్పారు. అనంతరం కొత్త అక్విడెక్టుపై పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసకుంటామన్నారు. ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లలో ఏర్పాటుచేసే ఇనుప రాడ్లను రెండు రకాలను పరిశీలిస్తున్నామని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక మోడల్‌ను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. డీఈ వెంట పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఇసుకపూడి నీటిసంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్

- కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం పరిశీలన


పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుపై పరిశీలన జరుపుతున్న కేంద్ర, రాష్ట్ర అధికారులు

గొల్లప్రోలు రూరల్/కొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చేనేత కార్మికుల నైపుణ్యాల పెంపుదల, అభివృద్ధి లక్ష్యంగా చేనేత క్లస్టర్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం బుధ, గురువారాల్లో పర్యటించింది. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాజెక్టు మంజూరు చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇదే విషయంపై కేంద్ర చేనేత, జౌళిశాఖల మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేనేతరంగం అభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మెగా షోరూం, డిజైనింగ్, డైయింగ్ యూనిట్ల ఏర్పాటు నిమిత్తం రూ.15కోట్లతో ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై చెన్నైలోని దక్షిణభారత వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ సి.ముత్తుస్వామి, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌సాహూ, చేనేత-జౌళిశాఖ రాష్ట్ర ఏడీ వనజ, కాకినాడ జిల్లా ఏడీ కె.పెద్దిరాజు, ఢిల్లీబాబు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ డెవలప్‌మెంట్, వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, జాంధానీ చీరల ఉత్పత్తిదారుడు లొల్ల సత్తిపండు పరిశీలించారు. గొల్లప్రోలు నగర పంచాయతీతోపాటు తాటిపర్తి, చేబ్రోలు, చెందుర్తి, దుర్గాడ, కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి చేనేత సొసైటీలు, వాటికి చెందిన స్థలాలు, కార్మికుల స్థితిగతులు, మగ్గాలను పరిశీలించారు. ఈ నివేదికను కేంద్రానికి పంపుతామని అధికారులు చెప్పారు.

ఇసుక స్టాక్ పాయింట్ల తనిఖీ

- రికార్డులు పరిశీలించిన మైనింగ్ ఏడీ

ఎటపాక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల జాతీయ రహదారి సమీపంలో ఉన్న రెండు ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్లను గురువారంజిల్లా మైనింగ్ ఏడీ ఆనంద్ తనిఖీ చేశారు. ఇసుక అమ్మకాలు నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్-1లో స్టాక్ రికార్డును పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ఇసుక అమ్మకాలు చేశారు..? ఎంత ఇసుక నిల్వ ఉందనే దానిని పరిశీలించారు. గృహఅవసరాలకు వినియోగించు లబ్ధిదారులకు ఆధార్ స్థానికతలో అమ్మకాలు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ లో ఇసుక కొనుగోలు చేయకుండా, అనుమతులు లేకుండా స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలను రానీయవద్దని తెలిపారు. తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాలకు ఇసుక లోడ్ చేయవద్దని, అలాంటి వాహనాలను స్టాక్‌పాయింట్ వద్దకు అనుమతించవద్దని సూచించారు. అనంతరం రాయనపేట, కన్నాయిగూడెం గ్రామాల్లో గోదావరినదీ ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో నాగమణి, తదితరులు ఉన్నారు.


స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న మైనింగ్ ఏడీ

పెరికివలస ప్రత్యేక పంచాయతీ

ఏర్పాటుకు గ్రామసభ

- నూతన పంచాయతీలకు తీర్మానం

వై.రామవరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలోని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు కోసం మండలంలోని చింతలపూడి పంచాయతీ పెరికివలస గ్రామంలో గురువారం ఎంపీడీవో బాపన్నదొర గ్రామసభ నిర్వహించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం గుర్తేడును ప్రత్యేక మండలంగా చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున నూతనంగా ఏర్పాటయ్యే గుర్తేడు మండలంలో 12 గ్రామాలతో చింతలపూడి పంచాయతీలోని పెరికివలస, పుట్టగండి, రచ్చవలస, దుమ్మదారవాడ, చింతవలస, కుంకుమామిడి బంద, కత్తిరాళ్ళు, పంచదారలంక, సీతలంక, నీలిపొలం, జమ్మనవీది, దుమ్మనగడ్డ గ్రామాలతో నూతన పంచాయతీకి తీర్మానం చేశారు. ఎంపీపీ ఆనందరావు, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, ఉపసర్పంచ్ పల్లాల రాజుగోపాల్‌రెడ్డి, గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు, హౌసింగ్‌శాఖ నాగార్జున, ఉపాధి ఏపీవో స్వామి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.



పత్యేక పంచాయతీ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్న దొర, కొత్త పంచాయతీగా పెరికివలస పేరు అరిటాకుపై రాసిన గిరిజనులు

యథేచ్ఛగా ఏలేరు మట్టి తరలింపు

- ఏలేశ్వరం గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం
- పట్టించుకోని రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు


ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టు సమీపంలో అక్రమంగా తవ్వేసిన మట్టి కొండలు

ఏలేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు సమీపంలో ఉన్న మట్టికొండలను అక్రమార్కులు కొల్లగొట్టుకుంటూపోతున్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో సుమారు 15 ట్రాక్టర్లతో తవ్వుకుంటూ పోతున్నా సంబంధిత ఏలేరు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ మట్టిని ఇళ్లు, దుకాణాల నిర్మాణంలో పునాదులకు ఇతర అవసరాలకు తరలించి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. రిజర్వాయర్ నుంచి వరద నీరు వచ్చే ప్రాంతానికి సమీపంలోనే మట్టి తవ్వకాలు జరగడంతో స్థానికంగా నివసించే ప్రజలు, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిధమైన తవ్వకాలతో తమకు రక్షణలేకుండాపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఇలాగే తవ్వుకుంటూపోతే ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరుతో ఏలేశ్వరం పట్టణ, రూరల్ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఏలేరు అధికారులకు సమస్యను వివరించినావారు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ట్రాక్టర్ మట్టి ను మారు రూ.3500నుంచి రూ.4500 వసూలు చేస్తూ అక్రమార్కులు లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. కాసుల కక్కుర్తితో ఏలేరు రక్షణ తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడంతో పలు ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇకనైనా ఏలేరు, రెవెన్యూ అధికారులు చొరవచూపి అక్రమంగా తవ్వుతున్న మట్టి తవ్వకాలపై అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

భీమేశ్వరాలయంలో వైభవంగా జ్వాలాతోరణం

దాక్షారామ,నవంబరు6(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గురువారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతి కాంతిలో ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలా తోరణం నిర్వహించారు. ఆలయ సహాయకమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.


భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

అంతర్వేది నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



అంతర్వేదిలో విరాళం అందిస్తున్న కొత్తపల్లి రామకృష్ణ దంపతులు, అయినవిల్లిలో దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు, అన్నవరంలో ఏఈవో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు కడియం మండలం బుర్రిలంకకు చెందిన కొత్తపల్లి రామకృష్ణ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.1,00,016లు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ భరత్‌కుమార్, సాయిలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో అన్న దాన విభాగ ఉద్యోగులు కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ తదితరులున్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం వియ్యారివారిమెరక గ్రామానికి చెందిన చింతా ఉమామహేశ్వరరావు-సావిత్రి దంపతులు కుటుంబ సమేతంగా గురువారం శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.100,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి కార్యనిర్వహణాధికారి అభినందించారు.

రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ.4లక్షలు విలువైన డైమండ్ లాకెట్‌ను పోగొట్టుకున్న బాధితురాలికి దొరికిన మహిళ అప్పగించి ఔదార్యాన్ని చాటుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాస రెడ్డి తన భార్యతో ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి బుధవారంరాత్రి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె మెడలో రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ గుడిలో జారిపడిపోయింది. ఈ విషయం పక్కనే ఉన్న ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు తెలియడంతో స్థానిక గ్రూపులలో బాధితురాలు పోగొట్టుకున్న విషయాన్ని పోస్ట్ చేశారు. అదే గ్రామానికి చెందిన ఇండుగుల కృష్ణవేణికి ఈ లాకెట్ దొరకడంతో అయ్యప్పభక్తులకు అందజేశారు. స్వాములందరూ లాకెట్ పోగొట్టుకున్న బాధితురాలు ఇంటికి వెళ్లి అప్పగించారు. వస్తువు దొరికిన కృష్ణవేణిని అందరూ అభినందించి నగదు బహుమతిని అందజేశారు.


పోగొట్టుకున్న బంగారు లాకెట్‌ను అప్పగించిన కృష్ణవేణికి నగదు పురస్కారం అందజేస్తున్న దృశ్యం


రక్తపు మడుగులో మృతుడు వడిశెల అప్పారావు (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

తనయుడి చేతిలో తండ్రి హతం

- చెల్లెలి వివాహంపై వివాదం
- కూరగాయల చాకుతో

గొంతు కోసి హత్య

రాజానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెల్లెలి వివాహ విషయమై తండ్రీకొడుకుల మధ్య తలెత్తిన ఘర్షణ తండ్రి వడిశెల అప్పారావు(47))కుమారుడు సాయికుమార్ చేతిలో హతమైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరంరూరల్ మండలం తొర్రేడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అప్పారావు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె ప్రశాంతికి అప్పారావు ధవళేశ్వరానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. ఆ వ్యక్తితో ప్రశాంతి దగ్గరైంది. అయితే పెళ్లికొడుకు తరుపు వారు కట్నం ఎక్కువ అడుగుతుండడంతో ప్రశాంతికి చూసిన పెండ్లి సంబంధం చేయడానికి తన దగ్గర అంత డబ్బు లేదు. ఈ మధ్యనే ఇళ్లు కట్టి కొద్దిగా అప్పుల్లో ఉన్నానని, మరో సంబంధం చూద్దామని భార్య, కుటుంబ సభ్యులతో కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాడు. ఈ లోపులోనే ఇరు కుటుంబాల వారు దగ్గరయ్యారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఇంటికి ఆలస్యంగా రావడంతో తండ్రి దూషిస్తూ మాట్లాడాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రిని కొడుకు సాయికుమార్ అడ్డుకున్నాడు. దీంతో గొడవ పెద్దదై తండ్రిని గెంటివేయడంతో అతడి తల గోడకు బలంగా తగులుకుని కింద పడిపోయాడు. ఆ సమయంలో భార్య, ప్రశాంతి గట్టిగా కేకలేశారు. దీంతో సాయికుమార్ వారిద్దరినీ పక్కనున్న గదిలోకి నెట్టి తలుపు గొళ్లెపెట్టి ఇంట్లోని కాయగూరలు కోసే చాకుతో తండ్రి పీక కోసేశాడు. అప్పారావు రక్తపు మడుగులో పడి కొట్టుమిట్టాడుతుండగా సాయికుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయాన్ని ప్రశాంతి సమీపంలో ఉంటున్న మేనత్త బి.సీతకు ఫోన్ లో సమాచారం అందించింది. హుటాహుటిన సీత అప్పారావు ఇంటికి వెళ్లి చూసే అప్పారావు మృతిచెంది ఉన్నట్టు గుర్తించింది. ఈ మేరకు సీత ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై కారు దగ్ధం

- పరుగులు తీసిన వాహనదారులు

తునిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా 16వ నెంబరు జాతీయ రహదారి తునిరూరల్ వి.కొత్తూరు వద్ద కదులుతున్న కారులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారు జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట వైపు వెళుతుండగా ఒక్కసారిగా కారులోంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరుగులు తీయడంతో నిమిషాల వ్యవధిలో మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో జాతీయ రహదారి ఇరువైపులా ప్రయాణిస్తున్న వాహనదారులు భయాందోళన చెంది ఎక్కడ వాహనాలు అక్కడే ఆపేశారు.దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వాహనం తగలపడి ఎగసిపడుతున్న మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.


జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

ఫీల్డ్‌అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

అయినవిల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): కొండుకుదురుకు చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ మరణించగా గురువారం అతని కుటుంబాన్ని ఎంపీడీవో జి.సరోవర్ పరామర్శించారు. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తరఫున రూ.26వేలు నరేష్‌కు భార్యకు అందజేసి వారి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి పరామర్శ

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) ఇటీవల హత్యకు గురయ్యాడు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించి ఓదార్చారు. కూటమి సభ్యులతో కలిసి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే


పాలగుమ్మిలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భూమినే నమ్ముకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో పంటల పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అధికారులు వివరించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ అధ్యక్షతన వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం పాలగుమ్మిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ పంటలకు అవసరమైన పోషకాలు, నీటిపారుదల, పురుగుమందుల వాడకం తదితర అంశాల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాగు చేస్తున్న పంటలపై శాస్త్రీయ సలహాలను వివరించారు. పంటలు ఆరోగ్యకరంగా పెరగడానికి అవసరమైన మట్టి పరీక్షలు, ఎరువుల సమతుల్యత, సేంద్రీయ ఎరువుల వినియోగం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు మట్టా మహాలక్ష్మిప్రభాకర్, కె.చంటిరాజు, పొలమూరి ధర్మపాల్, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సొసైటీల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే దేవ


ఎమ్మెల్యే దేవను సన్మానిస్తున్న ఎస్సీ సంఘ నాయకులు

మలికిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని ఎస్సీ సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం పడమటిపాలెంలో జరిగిన తీర ప్రాంత సీసీఎఫ్ సొసైటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీర ప్రాంతంలో ఉన్న సొసైటీల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఈప్రాంతంలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మించాలని, కొబ్బరి ఆధారిత పరిశ్రమ నెలకొల్పాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుడిమూలలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం జరుగుతుందని, గుడిమెళ్లంక, శంకరగుప్తంలలో మరో రెండు సబ్‌స్టేషన్లు నిర్మిస్తామన్నారు. రూ.80కోట్లతో శంకరగుప్తంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా తీర ప్రాంతంలో సమస్యలు తీరతాయన్నారు. ఎస్సీలకు పొజిషన్ సర్టిఫికెట్ల కోసం ఈనెల8న జరిగే డీఆర్సీ సమావేశంలో మాట్లాడతానన్నారు. ఈ నియోజకవర్గాన్ని మోడల్‌గా అన్ని రంగాల్లో, అన్ని సామాజికవర్గాలు అభివృద్ధి చెందేలా ముందుకు వెళతానన్నారు. సభకు అధ్యక్షత వహించిన శంకరగుప్తం సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రూ.80కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి తమ గ్రామంలో భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్సీ సొసైటీల తరఫున ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సన్మానించారు. సమావేశంలో డీసీవో ఎ.రాధాకృష్ణ, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, తాడి సత్యనారాయణ, ఓగూరి తాండవ్‌రాజు, గంటా ప్రభాకర్, రాపాక సత్యనారాయణ, తాడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో పీహెచ్‌సీ త్వరలో పునఃప్రారంభం


ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని త్వరలోనే పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. నూతన భవన నిర్మాణం పూర్తయ్యేలోపు తాత్కాలికంగా అసంపూర్తిగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో నిర్వహిస్తామని చెప్పారు. నరేంద్రపురంలో గురువారం ఆయన జిల్లా ప్రోగ్రామ్ మోనటరింగ్ ఆఫీసర్ డాక్టర్ టీకె శ్రీనివాస్‌తో కలిసి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న ఆయుష్మాన్ మందిరాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం నరేంద్రపురం పీహెచ్‌సీ కోసం స్థల పరిశీలన చేశారు. పంచాయతీ తీర్మానంతో పాటు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే పశువుల ఆసుపత్రిని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే శిథిలావస్థలో ఉన్న కచేరీచావిడిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సర్పంచ్ బీర వెంగమాంబ, వైస్ ఎంపీపీ పప్పుల సాయిబాబు, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, సొసైటీ ఛైర్మన్ తోలేటి నారాయణ మూర్తి, కె.సత్యనారాయణరాజు, కేదాశి చిన్న, నక్కా సత్యనారాయణ, గుత్తుల చంటి, ఆదినారాయణ, యర్రంశెట్టి శ్రీనివాసరావు, శంకర్‌లాల్ పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ముమ్మిడివరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగించి, బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలనిప్రజాసేవకురాలు జనిపల్లి సంధ్యారాణి డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు ఆమె మద్దతు పలికారు. రవికుమార్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినా ఆర్టీసీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు.

ఎఫ్‌టీసీఎల్‌ఆర్ల ఆందోళన

యానాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజాపనుల శాఖలో 20ఏళ్ల నుంచి ఎఫ్‌టీసీఎల్‌ఆర్లగా పనిచేస్తోన్న 126మందిని పర్మినెంట్ చేయాలని సిబ్బంది ఆందోళన రెండో రోజు గురువారం కొనసాగింది. సాయంత్రం ప్రజాపనుశాఖ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. తర్వాత కార్యాలయం ఎదుట బైఠాయించి ప్లకార్డులతో ఆందోళన చేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రామేశ్వరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశాల్లో ప్రజలకు మైకు ఇచ్చి మీ సమస్యలు ఏమిటని ఎమ్మెల్యే దేవ గురువారం అడిగి తెలుసుకున్నారు. రూ.1650కోట్లతో సెంట్రల్ వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా తొలి ప్రాధాన్యం రాజోలు నియోజకవర్గానికి ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సఖినేటిపల్లి కుమ్మరిగరువు చింతావారితూము వద్ద 60వేల లీటర్లు, దొడ్డావారిపేటలో 40వేల లీటర్లు, రామేశ్వరం గుబ్బలవారిపాలెం ఎస్సీ కాలనీలో 40వేల లీటర్ల వ్యాంటర్ ట్యాంకులకు భూమి పూజ చేశారు. అనంతరం దొమ్మేటి వెంకటరెడ్డి రైసుమిల్లు వద్ద ఉపాధిహామీ నిధులతో నిర్మించిన రూ.19.20లక్షల సీసీ రోడ్డును కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మధ్యాహ్నం మోరి గ్రామం నక్కలపర్రులో 40వేల లీటర్ల వాటరు ట్యాంకుకు భూమిపూజ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, ఎంపీపీ వీరా మల్లిబాబు, చెల్లింగి లీలామోహన్, ముప్పర్తి నాని, కట్టా ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు, రావూరి నాగు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకానికి దూరంగా ఉండాలని తెలియజేస్తూ దీప్తి కళాశాల విద్యార్థులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. జాతీయ సేవా పథకం ప్రత్యే సేవా శిబిరంలో భాగంగా ఏడో రోజు గురువారం కొమరాడ, మాకనపాలెం గ్రామాల్లో మాదక ద్రవ్యాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనార్థాలు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వలవల సత్యవేణి, ఎంపీటీసీ వలవల సాయిబాబా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ.ఈశ్వరరావు, పి.సుబ్బారావు, వి.నాగరాజు, వి.కొండలరావు పాల్గొన్నారు.

కూరల పంటలతో అధిక ఆదాయం

రాజోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతు తక్కువ స్థలంలో అధిక ఆదాయం పొందాలంటే పొలం చుట్టూ ఎల్ ఆకారంలో గట్టు ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగాలు ఉంటాయని రాజారావు తెలిపారు. ఆకుకూరలు, కాయగూరలు, అరటి మొదలగు పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కడలిలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పి.ప్రసన్నకుమార్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం డివిజన్ పరిధిలో గల ట్రైనీ ఐసీఆర్పీలకు మూడో రోజు శిక్షణలో భాగంగా ఏ-గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్, శాశ్వత ధ్రువజీవామృతం ట్యాంకు ఉపయోగాలను వివరించారు. అనంతరం కషాయాల తయారీ, వినియోగం గురించి ఉపయోగాలు వివరించారు. డీపీఎం శ్రీనివాస్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఎన్‌ఎఫ్‌ఏలు, ఎఫ్‌ఎంటీలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మోహనరావుతో కలిసి ఏఎంసీ వైస్ ఛైర్మన్ పరమట చిట్టిబాబు గురువారం నియోజకవర్గంలోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ప్రధానంగా భట్నవిల్లి, నడిపూడి చెక్‌పోస్టుల వద్ద పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. రోజువారీగా కొబ్బరి, వరి, రొయ్యల సరఫరాకు సంబంధించి పన్ను వసూళ్లపై ఆరా తీశారు. చెక్‌పోస్టుల వద్ద సక్రమంగా విధులు నిర్వహించడంతో పాటు రశీదులు తనిఖీ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పక్కదారి పట్టకుండా సెక్యూరిటీ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలి


కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి అంకిత్‌మిశ్రాతో సమావేశమైన మల్లాడి

యానాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతం యానాం నియోజకవర్గంలో కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి అంకిత్ మిశ్రాతో గురువారం మల్లాడి సమావేశమయ్యారు. గతంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. అనంతరం యానాం అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను అందజేశారు. యానాంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం తీసుకుని వాటిలో కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 11పారామెడికల్ కోర్సులు ఏర్పాటుతో పాటు కారైకాల్ తరహాలో 50 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. యానాంలో ఉన్న జిప్మెర్ ఆసుపత్రిలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని అప్పటికి వీటికి సంబంధించిన నివేదికలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులు కేంద్ర మంత్రి సూచించారని మల్లాడి తెలిపారు.

బాధిత బాలికను సంక్షేమ హోమ్‌లో చేర్పించాలి

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాణాపురంలో అత్యాచారానికి గురైన బాలికను సంక్షేమ హోమ్‌లో చేర్పించాలని పౌర హక్కుల సంఘం కమిటీ విజ్ఞప్తి చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పౌర హక్కుల సంఘం కమిటీ కన్వీనర్ జిల్లెళ్ళ మనోహర్, అమలదాసు బాబూరావుతో కూడిన బృందం గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. జరిగిన ఉదంతంపై వివరాలు సేకరించింది. బాలిక చదువుకుంటున్న ఉన్నత పాఠశాలను బృందం సందర్శించింది. నిందితుడు రాయపురెడ్డి వెంకటకృష్ణను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చిన రూ.5లక్షలు ఇప్పటికీ ఇవ్వలేదని వారు ఆరోపించారు. అలాగే స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు ఇప్పటివరకు బాలికను కలిసి మాట్లాడకపోవడంపై వారు తీవ్రంగా స్పందించారు. బాధిత కుటుంబానికి నివేశన స్థలం ఇచ్చి, పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

3న ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు

అమలాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీల ద్వారా ఒక చక్కటి వేదికను కల్పిస్తున్నట్టు రిలయన్స్ సీఎస్సార్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కోనసీమ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో డిసెంబరు 3న అమలాపురంలోని అంబేడ్కర్ భవన్‌లో ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈపోటీల్లో 8,9,10 తరగతుల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని, క్విజ్‌ను విడివిడిగా నిర్వహిస్తారని తెలిపారు.విజేతలకు ల్యాప్‌ట్యాప్‌లను బహుమతులుగా అందిస్తామన్నారు. ఇద్దరు విద్యార్థులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తారని, ప్రతీ పాఠశాల నుంచి రెండు టీమ్స్ ఎంపికచేసే అవకాశంఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్విజ్ కేంద్రాలకు వచ్చి, వెళ్లేందుకు ప్రయాణ చార్జీలు చెల్లిస్తారన్నారు. ఈనెల30వతేదీ ఉదయం 10నుంచి 5గంటలలోగా పేర్ల నమోదుకు 08843577222, 6302223156లను సంప్రదించాలన్నారు. జనరల్ నాలెడ్జ్, ప్రపంచ, దేశ చరిత్ర కరెంట్ అఫైర్స్, క్లాస్‌రూమ్ కరిక్యులమ్ అంశాలపై ప్రశ్నావళి ఉంటుందని, ధీరూభాయ్ అంబానీ జన్మదినం సందర్భంగా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పేదలకు అన్యాయం జరిగిందంటూ నిరసన


నిరసన తెలుపుతున్న తుఫాన్ బాధితులు

మామిడికుదురు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయం పంపిణీలో అర్హులైన పేద బాధితులకు అన్యాయం జరిగిందని వారు గురువారం మొగలికుదురు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. చేనేత కార్మికులు ఒక్కొక్కరికీ ప్రభుత్వం 50కిలోల బియ్యం ప్రకటించగా గ్రామంలో మాత్రం 25కిలోలు పంపిణీ చేశారని, పంపిణీలో తేడాలు జరిగాయని ఆరోపించారు. పక్కా భవనాల్లో ఉన్న వారికి నిత్యావసరాలు, ఆర్థికసాయం అందించారని, దీనిపై అధికారులు పరిశీలనచేసి ఇబ్బంది పడిన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిర్రా సత్యనారాయణ, చుట్టుగుళ్లసత్యవతి, ఎలుమర్తి మంగ, తొత్తరమూడి అమ్ములు, బొక్కా వెంకటేశ్వరరావు, ఉల్లంపర్తి పుణ్యవతి, మట్టపర్తి నాగమణి పాల్గొన్నారు.

నౌకాదళం అంతర్జాతీయ శిబిరంలో పాల్గొన్న మూర్తి


మూర్తిని అభినందిస్తున్న ఎస్కేబీఆర్ కళాశాల అధ్యక్షుడు సుబ్బరాజు తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న కేవీబీఎస్ మూర్తి వివిధ దేశాల్లో జరిగిన నౌకాదళం అంతర్జాతీయ శిబిరాల్లో పాల్గొని తిరిగి వచ్చాడు. కళాశాలకు చెందిన నావెల్ విభాగం-6ఏకు చెందిన మూర్తి ఓవర్సీస్ డిపార్టుమెంట్ శిబిరానికి కళాశాల తరఫున ప్రాతినిధ్యం వహించినట్టు ప్రిన్సిపాల్ వీవీ సుబ్బారావు తెలిపారు. మూర్తి సౌతాఫ్రికా, కెన్యా, మొంజాబికా తదితర దేశాల్లో గత సెప్టెంబరు 8నుంచి ఈనెల 2వరకు భారత నావికాదళం ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. అంతర్జాతీయ శిబిరంలో పాల్గొని కళాశాల ఖ్యాతిని ఇనుమడింపచేసిన మూర్తిని పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కార్యదర్శి తాతా అవధానులు, డీఎస్ఎన్ రాజు, ఏవో ఎ.వెంకటపతిరాజు, ఎన్‌సీసీ విభాగాధిపతులు కెప్టెన్ డాక్టర్ ఏవీఎస్ శర్మ,కె.అప్పారావు తదితరులు అభినందించారు.

డ్రైవర్లు స్టీరింగ్‌పై కుటుంబ సభ్యుల ఫొటో పెట్టుకోవాలి


ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా అధికారులు శ్రీనివాసరావు, రాఘవకుమార్

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు స్టీరింగ్‌పై కుటుంబ సభ్యుల ఫొటో పెట్టుకోవడం వల్ల బాధ్యత గుర్తెరిగి మరెంతో బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తారని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపోలోని డ్రైవింగ్ స్కూలులో జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. ముఖ అతిథిగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైవర్లు కదిలే దేవుళ్లన్నారు. పూర్తి ఏకాగ్రతతో మానసిక ప్రశాంతతో డ్రైవింగ్ చేయాలని సూచించారు. కోనసీమ జిల్లాలోనినాలుగు ఆర్టీసీ డిపోలకు చెందిన అద్దె బస్సుల డ్రైవర్లు శిక్షణలో పాల్గొన్నారు. వీరిలో నలుగురు ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలుఅందజేసి సత్కరించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ డీఎల్ఎన్ శర్మ, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరహాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు అనూష



అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.అనూష రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ బుజ్జి తెలిపారు. రావులపాలెంలో అండర్-17 జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అనూష అద్భుత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 8, 9,10 తేదీల్లో విజయవాడ పడమటలో జరిగేరాష్ట్ర స్థాయి పోటీల్లో అనూష జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. అనూషను హెచ్ఎం లంకరాణి, ఉపాధ్యాయ స్టాఫ్ సెక్రటరీ జి.పెద్దిరాజు, సర్పంచ్ చొల్లంగి శివాజీ నిఅప్పాజీ, ఉపసర్పంచ్ హనుమాన్ బుజ్జి తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు కెప్టెన్‌గా సందీప్

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో అమలాపురం శ్రీనంద్ స్కూలు 8వతరగతి విద్యార్థి గోసంగి సందీప్ అద్భుత ప్రతిభ చాటి స్వర్ణ పతకాలు సాధించాడు. అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగాల్లో సందీప్ స్వర్ణ పతకాలు సాధించాడు. అంతేకాకుండా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టు కెప్టెన్‌గా సందీప్‌ను ఎంపికచేశారని పాఠశాల కరస్పాండెంట్ యెనుముల కనకదుర్గవిశ్వం తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగే కార్యక్రమంలో సందీప్‌ను పలువురు అభినందించారు.

తుఫాన్ బాధితులకు సాయం పంపిణీ

పి.గన్నవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నష్టపోయిన ప్రజలను, రైతులను ప్రభుత్వం ఆదుకుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రాజులపాలెంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని అందించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

మలికిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం మోరి, నక్కలపర్రలో 60వేల కెపాసిటీ గల వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా రాజోలు నియోజకవర్గానికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన సూర్యావతి, గుబ్బల ఫణి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, జాన శంకరరావు, సచిన్, వెంకటరత్నం, సుధాకర్, వీరా రామారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. తీర ప్రాంత గ్రామాలు నీట మునిగి ఇంటి చుట్టూ మురికినీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఫాగింగ్‌చేసి అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టారు. తడిచెత్త-పొడిచెత్త ఉదయం నుంచి పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్నట్టు కార్యదర్శి ప్రత్యూష్ తెలిపారు. సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్) కూటమి శ్రేణులతో కలిసి తుఫాన్ బాధితులకు బియ్యం పంపిణీ చేశారు.

ఆత్మనిర్భర్ భారత్

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వయం సమృద్ధి భారత్ నినాదంతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పార్టీ శ్రేణులు స్టిక్కర్లు అంటికించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన సఖినేటిపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల పరిశీలకుడు అడబాల రాంబాబు మాట్లాడుతూ ప్రతీ ఇంట స్వదేశీ-ఇంటింటా స్వదేశీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో చెంపాటి శివరామకృష్ణంరాజు, పోతురాజు సురేష్, బోనం నాయుడు, పోతురాజు నాగరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, పడాల శ్రీను, కొణతం శ్రీను, అల్లూరి సత్యనారాయణరాజు, నంబూరి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పశువుల దాణా పంపిణీ

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లో మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా పశు సంవర్థకశాఖ పాడి రైతులకు 50శాతం సబ్సిడీపై పది టన్నుల పశువుల దాణా అందజేశారు.ఉండపల్లి అంజి, యెనుముల తాతాజీ, బెల్లంకొండ పుత్రయ్య, చెల్లుబోయిన వెంకటశెట్టి, డాక్టర్ బీబీ సంపత్‌కుమార్, డాక్టర్ వీవీ సురేష్, బి.జానకీరామారావు, ఎం.శ్రీను పాల్గొన్నారు.

వందేమాతరం రచయిత బంకించంద్ర చటర్జీకి నివాళి

మలికిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం రచయితీ బంకించంద్ర చటర్జీ రచనకు 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం విశ్వేశ్వరాయపురంలో వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో వందేమాతరం 150ఏళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వందేమాతరం గీతం ప్రాముఖ్యత, దాని చరిత్ర, ప్రధాన స్ఫూర్తి గురించి వివరించారు. విద్యార్థులకు పాఠశాలల్లో పాటలు, వ్యాసరచన, పుణన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీవీవీ వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై దాడికి నిరసన


అమలాపురం ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ ప్రతినిధులు

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న కార్మికులపై జరిగిన దాడిని ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసనలు తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయా డిపోల వద్ద గేట్ మీటింగులు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులకు రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల క్రింద కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమలాపురం ఆర్టీసీ ఎన్ఎంయూ డిపోలో కార్యదర్శి పితాని మణిరాజు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో రీజనల్ కార్యదర్శి పందిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

మలికిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో ఎత్తువంతెన వద్ద నిర్మించిన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి అప్పనరామునిలంకకు చెందిన కటికిరెడ్డి చిట్టియ్య దంపతులు రూ.10,116 రామేశ్వరానికి చెందిన గుబ్బల నరసింహస్వామి దంపతులు రూ.10వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, కటికిరెడ్డి మహేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు సాధ్యం

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ కుసుమ వనజాకుమారి పేర్కొన్నారు. నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ మంథా తుఫాన్ సమయంలో నగరం పీహెచ్‌సీలో డెలీవరీ కేసు నమోదుచేసి సురక్షిత ప్రసవం చేసిన యల్లమెల్లి సుమ కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. గురువారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతతో పాటు, పీహెచ్‌సీలో డెలీవరీ సమయంలో పనిచేసిన సిబ్బందిని సన్మానించారు. స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, నాయకులు జాలెం సుబ్బారావు, కొల్లాబత్తుల వెంకటరమణ, కుసుమ పెరుమాళ్ల కుమార్, మట్టా సత్తిబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్‌లెవీ, సూపర్‌వైజర్ బళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. యేడిద బాబి-అనంతమణి, యేడిద కార్తీక్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. గణనాథుడికి వినాయక పూజ, సుబ్రహ్మణ్య స్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజతో పాటు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వివిధ రకాల పుష్పాలు, అరటి డొప్పలతో ఏర్పాటుచేసిన 18మెట్ల వద్ద పడిపూజ ఘనంగా చేశారు. స్వాములు అయ్యప్పగీతాలు ఆలపించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్‌కు గాయాలు

ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్, ఆర్ఎంపీ వైద్యుడు జనిపల్లి రమేష్‌బాబు బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మోటారుసైకిల్‌పై అమలాపురం వెళ్లి తిరిగి వస్తుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ మూలతూము సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో అదుపుతప్పి మోటారు సైకిల్ పైనుంచి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌బాబును అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

అమలాపురం ఆసుపత్రికి రవికుమార్ తరలింపు

ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని ఆక్రమణలు తొలగించాలని ఆమరణ దీక్ష చేపట్టిన మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్‌ను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రవికుమార్ చేపట్టిన దీక్షను బుధవారం పోలీసులు భగ్నంచేసి ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో మెరుగైన వైద్య సేవల కోసం అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

అంబాజీపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. ముక్కామల హెచ్ఎంగా ఉద్యోగ విరమణ చేస్తున్న మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి సన్మాన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి దంపతులను డీఈవోతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవైఈవో రామలక్ష్మణమూర్తి, జిల్లా అధికారులు జి.రమేష్, ఎంఏకే భీమారావు, బీర హనుమంతరావు, బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో వేంచేసిన ఉన్న ఉమాచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, మహన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం, సూర్యనమస్కారాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక మహేష్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు చేయూత అవార్డులు

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ చేయూత స్వచ్ఛంద సేవా సంస్థవారు మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశారు. అప్పనపల్లి ఎంపీ ఎలిమెంటరీ స్కూలు హెచ్ఎం నయినాల రఘురామయ్య, గోగన్నమఠం స్కూలు ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు చేయూత అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 8న కాకినాడలో జరిగే సమావేశంలో ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

మండపేట



మండపేట-జొన్నాడ మధ్య అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డు

రోడ్డు ధ్వంసమైనా పట్టించుకోరా?

• ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు

• మరమ్మతు చేపట్టాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండపేట-జొన్నాడ మధ్య వున్న అర్‌అండ్‌బి రహదారి ఇటీవలి వర్షాలకు గుంతలుగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతిరోజూ ఈ రోడ్లపై వందలాది వాహనాలు, బస్సులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గోతుల వల్ల ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకాన్ని చవి చూస్తున్నారు. చినుకుపడితే చాలు.. ఈ రోడ్డు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఇదే రహదారి గుండా ఓఎన్‌జీసీ వాహనాలతో పాటు పలు దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, లోడు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదంగా మారిన ఈ రోడ్డును తక్షణమే మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలకు యంత్రాల అందజేత

మంత్రి సుభాష్ కృషితో సీఎస్ఆర్ నిధులతో వితరణ



యంత్రాలను అందజేస్తున్న వాసంశెట్టి సత్యం, ఇసుజి మోటార్స్ ప్రతినిధులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ, ముక్తేశ్వరం, బట్లపాలెం పాలిటెక్నిక్ కళాశాలలకు మూడు బీఎస్ 6 యంత్రాలను ఇసుజి కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చింది. గురువారం ఉపాధి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇసుజి వైస్ ప్రెసిడెంట్ శంకర్ శ్రీనివాస్, జనరల్ మేనేజరు ఓనో సుంగ్ అందచేసిన యంత్రాలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం చేతులమీదుగా అందజేశారు. విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ పరికరాలు: రామచంద్రపురంలో భవిత కేంద్రానికి ఇసుజి మోటార్స్ అందజేసిన ఫిజియోథెరపీ పరికరాలను ఇసుజి కంపెనీ ప్రతినిధులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అందచేశారు. భవిత కేంద్రంలో దివ్యాంగులు మెరుగైన ఫిజియోథెరపీ సేవలను మండల భవిత కేంద్రం ద్వారా అందించే వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కెపిపి ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, సమగ్ర శిక్షాభియాన్ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవో నాగేశ్వరి, ఎంపీడీవో పద్మ జ్యోతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మాజీ కౌన్సిలరు అంకం శ్రీనివాస్, కె.నానాజీ, గోవిందు, ఏసుదాసు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో గురువారం ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్న ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర, ఇండస్ట్రీల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ఫిషరీస్ ఏడీ వర్ధన్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాజు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డు బ్యాంకు మేనేజర్ స్వామినాయుడు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభు త్వ పథకాలు, రుణ సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) కేశవరం గ్రామం నుంచి వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరిపోతున్నారు. ఇప్పటికే గ్రామానికి చెందిన ఎంపీపీ, అతని అనుచరులు, పంచాయతీ వార్డు సభ్యులు పలువురు వైసీపీ నుంచి టీడీపీ గూటికి వచ్చేశారు. గురువారం స్థానిక టీడీపీ నేతల సారధ్యంలో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలోకి వచ్చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, ఎంపీపీ వాసు నేతృత్వంలో గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు వేంకటేష్, గనియ్య సుబ్బారావు, మరిడియ్య, గంగరాజు, ఆశోక్, పలువురు పార్టీలో చేరిపోయారు. వారందరికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే వేగుళ్ల వారిని సాదరంగా ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన కేశవరానికి చెందిన కార్యకర్తలు

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం లో గురువారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి అయినవిల్లికి చెందిన గండి వెంకటేశ్వరరావు- ఆదిలక్ష్మి దంపతులు రూ.1,11,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



రాయవరంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

చేనేత కుటుంబాలకు సరుకుల పంపిణీ

రాయవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో చేనేత కార్మికుల కుటుంబాలకు గురువారం నిత్యవసరాలు పంపిణీ నిర్వహించారు. ఇటీవల తుఫాను కారణంగా ప్రభుత్వం నుంచి అందించిన నిత్యావసరాలను టీడీపీ ఇన్‌ఛార్జ్ ఉండవిల్లి రాంబాబు చేతుల మీదుగా 56 కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం, కిలో పంచదార, నూనె, కందిపప్పు, బంగాళాదుపంలు, ఉల్లిపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నాయకుడు దొంతంశెట్టి బాలకేదారీశ్వరుడు, చందన వెంకటేశ్వరరావు, కామిశెట్టి ప్రసన్నలక్ష్మి, నేతల సురేష్, మల్లిపూడి చిన్న, దేవిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండపేట మండల సమావేశం నేటి ఉదయం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చిస్తామని ఆయన అన్నారు.



ప్రత్యేక అలంకరణలో శనేశ్వరస్వామి

మందపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా శైవక్షేత్రాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. అవిడి శివాలయంలో స్వామి వారికి లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. మందపల్లి శనేశ్వరస్వామిని గురువారం ప్రత్యేకంగా అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. దేవదాయ శాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.



అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అద్దంపల్లి కూటమి నాయకులు దాసరి పెదకాపు, కొప్పిశెట్టి నారాయణ మూర్తి అన్నారు. గురువారం అద్దంపల్లి ఉన్నత పాఠశాలలో పెదకాపు సొంత నిధులతో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లులకు చీర, గాజులు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంబాల వెంకటేశ్వరరావు, బొండా సత్తిబాబు, దూడల నరేష్, ఎస్ఎంసీ చైర్మన్ జాన్సీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వెంకట్రావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాయవరంలో మునసబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునసబు సేవలు చిరస్మరణీయం

రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ ఉండవిల్లి సత్యనారాయణమూర్తి (రాయవరం మునసబు) చేసిన సేవలు మరవలేనివని రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అన్నారు. గురువారం రాయవరంలో మునసబు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఆయన ఎంతో పాటుపడ్డారన్నారు. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, స్థానిక దళితపేట, చేనేత సహకార సంఘం భవనం వద్ద ఉన్న మునసబు విగ్రహాలకు పలువురు నేతలు, అభిమానులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.రాము, మంతెన అచ్యుత రామరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, కోట బాబురావు, మల్లిడి రుద్రారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షబిల్వార్చన

కపిలేశ్వరపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో ఉన్న దుర్గామాత, పార్వతీసమేత, పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్షబిల్వార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేదపండితులు తంగిరాల వెంకట సత్య దత్తాత్రేయ సోమయాజి, శిష్య బృందం పర్యవేక్షణలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అనంతరం లక్షబిల్వార్చన పూజా కార్యక్రమాన్ని వేదమంత్రోశ్చరణల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దీపాలంకరణ సేవ

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం దీపాలంకరణ సేవ నిర్వహించారు. అయ్యప్పమాల ధరించిన భక్తులు అయ్యప్పస్వామి రంగులతో స్వామి వారి రూపాన్ని రూపొందించారు. స్వామివారి ఆలయంలో ప్రత్యేక దీపాలంకరణ సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

19న బలనిరూపణకు రంగం సిద్ధం

• మండలంలో తగ్గిన వైసీపీ బలం • ఆర్డీవోను అశ్రయించిన వైసీపీ ఎంపీటీసీలు • పావులు కదుపుతున్న కూటమి నేతలు • ఇప్పటికే ఎంపీపీతోపాటు ఆరుగురు టీడీపీలో చేరిన వైనం

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీపీ ఉండమట్ల వాసు వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో ఆయనపై అవిశ్వాసం నోటీసును వైసీపీ విప్, మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావుతోసహ మొత్తం 14 మంది ఎంపీటీసీల సంతకాలతో ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ వాసు వైసీపీ నుంచి ఎన్నికయ్యారని, ఇటీవల పార్టీ ఫిరాయింపు చట్టాన్ని ఉల్లంఘించి టీడీపీలో చేరాడన్నారు. ఈ నేపథ్యంలో అతనిపై వేటు వేయాలని వైసీపీ సభ్యుల చేసిన ఫిర్యాదు మేరకు 19న మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించి ఎంపీపీ బలపరీక్షలో ఎవరికి ఎంపీటీసీల బలం ఉంటుందో వారికి ఎంపీపీ వరించనుంది. ప్రస్తుతం పార్టీ మారినా ఎంపీపీగా పనిచేస్తున్న వాసు భవితవ్యం 19న ఎంపీపీగా కొనసాగుతారా...లేదా తేలనుంది. మండల పరిషత్‌కు సంబంధించి 22 మంది ఎంపీటీసీలకు గాను 20 మంది ఎంపికయ్యారు. ఇద్దరు మాత్రమే టీటీపీ తరపున గెలుపొందారు. 22 మంది ఎంపీటీసీల్లో ఒకరు మరణించగా మరొకరు విదేశాలకు వెళ్లటంతో కేవలం 20 మంది ఎంపీటీసీలు వున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వైసీపీ నుంచి ఎంపీటీసీలు వలస వచ్చేశారు. వైసీపీకి చెందిన ఎంపీపీ ఉండమట్ల వాసు కేశవరం నుంచి మరో ఎంపీటీసీతో కలిసి టీడీపీలో చేరిపోయారు. ఆయనతోపాటు వైస్ ఎంపీపీగా వున్న ద్వారపూడికి చెందిన గజ్జి రమణ వైసీపీ నుంచి జనసేనలోకి చేరిపోయారు. ఆయనతోపాటు మరొకరు టీడీపీలో చేరారు. దీంతో మండలంలో వైసీపీ ఎంపీటీసీల బలం తగ్గింది. టీడీపీ తరపున అర్తమూరు, వెలగతోడు గ్రామాల నుంచి ఇద్దరు ఎంపీటీసీలు గెలుపొందారు. మండలంలో మారిన సమీకరణల నేపధ్యంలో ఎంపీటీసీల బలం 9కి చేరింది. వైసీపీకి 20 మంది ఎంపీటీసీలు వున్నప్పటికి, మారిన సమీకరణలతో 11కి చేరింది. మండల పరిషత్‌లో తొలుత 20 మంది ఎంపీటీసీలు బలం వున్న వైసీపీకి ఇటీవల గట్టిషాక్ తగిలింది. ఎంపీపీ వాసుతో సహ మరో ఇద్దరు ఎంపీటీసీలు అతనితోపాటు టీడీపీలో చేరిపోయారు. పాలతోడు, వై.సీతానగరం, తాపేశ్వరం ఎంపీటీసీ లు వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరిపోయారు. ఇప్పుడు ఎంపీటీసీల బలం టీడీపీకి 9కి చేరగా, వైసీపీ ఎంపీటీసీలు సంఖ్య 20 నుంచి 11కి చేరింది. ఏడిద ఎంపీటీసీ ఖాళీ అయింది. ద్వారపూడికి చెందిన వైసీపీ ఎంపీటీసీ కువైట్ వెళ్లటంతో అమె పదవిని కోల్పోయింది. కోఆప్షన్ సభ్యుడు వున్నప్పటికి ఓటు హక్కు ఉండదు. అవిశ్వాసం పెట్టేందుకు 11 మంది సభ్యుల బలం ఉండటంతో ఎంపీపీపై అవిశ్వాసానికి వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు గతనెల 23న రామచంద్రపురం ఆర్‌డీవోకు ఫిర్యాదు చేసి చేశారు. ఫిర్యాదు అందిన నెల రోజుల వ్యవధిలో ఓటింగ్ పెట్టాల్సి ఉండటంతో 19న ఎంపీటీసీల బలాబలాల పరీక్షను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీటీసీల బలాబలాలకు సంబంధించి పార్టీల పరంగా ఎంత మంది ఉన్నారనే దానిపై 19న బలపరీక్ష ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 19న జరిగే అవిశ్వాస తీర్మానం నేపధ్యంలో జరిగే ఓటింగ్ సమయానికి మరొకరు లేదా ఇద్దరు ఎంపీటీసీలు టీడీపీ గూటికి చేరనున్నారని తెలిసింది. దీంతో వైసీపీ ఖాతాలో వున్న మండల పరిషత్ పీఠం కూటమి పార్టీలు కైసం చేసుకునేలా పార్టీనేతలు పావులు కదుపుతున్నారు. మొత్తం మీద ఎంపీపీపై అవిశ్వాస పరీక్ష వైసీపీకి కత్తిమీద సాములా మారనుంది. మరోవైపు కూటమి తమ ఖాతాలో ఎంపీపీ పీఠాన్ని వేసుకోవాలని ఎదురు చూస్తున్నట్టు తెలిసింది.

ఆలమూరులో ఏడు గ్రేడు-1 పంచాయతీలు



ఆలమూరు పంచాయతీ కార్యాలయం

ఆలమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మండలానికి సంబంధించి ఇప్పటి వరకు ఉన్న 13 క్లస్టర్ గ్రామ పంచాయతీలు రద్దై 18 పంచాయతీలుగా పలు గ్రేడులతో రూపుదిద్దుకోన్నాయి. తాజాగా పంచాయతీల జనాభా, ఆదాయం ఆధారంగా ఈ గ్రేడుల విధానాన్ని రూపొందించారు. మొత్తం 18 పంచాయతీలకు గాను ఏడు గ్రేడు-1 పంచాయతీలుగా గుర్తింపు పొందనున్నాయి. గతంలో ఆలమూరు, మడికి, చొప్పెల్ల పంచాయతీలు గ్రేడు-1గా ఉండేవి. ఇప్పుడు వాటికి తోడుగా జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, నర్సిపూడి, చెముడులంక పంచాయతీలు ఆమోదం పొందాయి. చింతలూరు, సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, పెనికేరు, మోదుకూరు, బడుగువానిలంక పంచాయతీలు గ్రేడు-2 హోదాను పొందుతున్నాయి. సూర్యారావుపేట, కలవచర్ల, నవాబుపేట గ్రామ పంచాయతీలు గ్రేడు-3గా ఉంటాయి. ఇక నుంచి అన్ని పంచాయతీలకు పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)లను నియమిస్తారు. వీరి అధ్వర్యంలో ప్రజలకు సేవలు, అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కపిలేశ్వరపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులకు గురైన చేనేత కార్మికులకు గురువారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అంగర శ్రీ గణపతి చేనేత సహకార సంఘం, నేలటూరు చేనేత సహకార సంఘాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. అనం తరం చేనేత కార్మికులకు ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే వేగుళ్ళ అందజేశారు. ఈ సంద ర్భంగా తహసీల్దార్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని 672 మంది చేనేత కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, కూటమి నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ, తాళ్ళ గంగాధరరావు, డి.నాగబాబు, పిల్లా బసవరాజు, దానేటి శరత్, వల్లి అంజి, ఎంపీడీవో భానూజీరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఎస్‌వో పద్మ, ఆర్ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, రేషన్ డీలర్లు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అంగరలో చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



సోమేశ్వరంలో ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలి

రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చాత్రాతి జానకి రాంబాబు, కె.శ్రీదేవి, బీజేపీ సీనియర్ నేత కోన సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సోమేశ్వరం గ్రామంలో ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో పర్యటించిన బీజేపీ నాయకులు స్వదేశీ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, చింతా తమ్మిరెడ్డి, ముత్యాల వీర్రాజు చౌదరి, ఈరెళ్ల కృష్ణమూర్తి, ఎం. జానకి రామయ్య, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బొబ్బా సూర్యప్రకాష్, ముప్పాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మాచవరం గ్రామానికి బీరక సీతారత్నం, వెంటూరు గ్రామానికి చెందిన చిరట్ల శ్రీరామమూర్తి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, మేడపాటి రవీంద్రారెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తీపర్తి శ్రీరమేష్, బత్తుల రామకృష్ణ, చిరట్ల వేణుగోపాలకృష్ణ, గొడితి సత్తిరాజు తదితరులు ఉన్నారు.

ఓటర్లుగా ఏపీఎన్జీవోలు నమోదు చేసుకోవాలి

కొత్తపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోల అసోషియేషన్ సభ్యులు 11వ తేదీ లోపు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు ఎన్వీ రామారావు కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తు కొత్తపేట యూనిట్‌లో గల కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం మండలాల ఎన్జీవోలు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నెల 24న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారిగా సీహెచ్ దొర వ్యవహరిస్తారని ఈ మేరకు జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వరరావు తెలిపినట్లు రామారావు తెలిపారు.



కొప్పిశెట్టి శశాంక్, గుడివాడ తేజశ్విని

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఊబలంక ఎస్జీజీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. ఆత్రేయపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 19వ విభాగం జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన కొప్పిశెట్టి శశాంక్, గుడివాడ తేజశ్విని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో 8న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున వీరు పాల్గొంటారన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం గురువారం సందర్భంగా ఆయా శివాలయాల్లో పూజలు నిర్వహించారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లోని శివాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. శివుడికి అభిషేకాల అనంతరం, మహిళలు దీపాలంకరణ నిర్వహించారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో అయ్యప్పస్వాములతో సందడి నెలకొంది. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన ట్రస్టుకు జంగారెడ్డిగూడేనికి చెందిన కేవీ ప్రభాకరకుమార్- సీతాకుమారి దంపతులు రూ.15,001 విరాళం ఇచ్చారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కపిలేశ్వరపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చిట్టూరి శ్రీధర్ మాట్లాడుతూ శుక్రవారం ప్రజలంతా ఉదయం 10 గంటలకు వందేమాతరం గేయం ఆలపించాలని కేంద్రం కోరిందన్నారు. విద్యార్థులకు రిహార్సల్స్ నిర్వహించామన్నారు. కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం, 150వ ఆకారంలో కూర్చుని జాతీయ గీతం ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) బాపట్లలో రేపటి నుంచి జరిగే టెన్ని కాయిట్ పోటీల్లో పాల్గొనే పట్టణానికి చెందిన క్రీడాకారులకు తాపేశ్వరంనకు చెందిన సురుచి ఫుడ్స్ అధినేత పి.మల్లిఖార్జునరావు క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని అకాంక్షించారు. కార్యక్రమంలో టీం కోచ్ కుంచే రమేష్, ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడా దుస్తులు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.